క్లుప్తంగా

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

ఆదిలాబాద్‌టౌన్: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని కేంద్రీయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని పాఠశాలలో సమావేశం నిర్వహించారు. 2020 నుంచి కేంద్రీయ విద్యాలయంలో జాతీయ విద్యావిధానం అమలులో ఉందన్నారు. ప్రతి అంశానికి సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యాంజలి పోర్టల్, పీఎంఈ విద్య, నిపుణ్‌భారత్ ఇనిషియేటివ్స్, విద్యప్రదేశ్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వర్షపు నీరు లీకేజీ కావడంతో వైద్యం కోసం వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత కోరారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. రోగులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ దీప్‌సింగ్ షెకావత్, ఆరెల్లి రాజలింగు, ఆడప్ చంపత్‌రావ్, మస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.

'చలో కేస్లాపూర్'కు తరలిరండి

ఇంద్రవెల్లి: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌తో రాయిసెంటర్ సార్‌మెడీల ఆధ్వర్యంలో ఈనెల 30న కేస్లాపూర్ నాగోబాదర్బార్‌లో నిర్వహించే చలో కేస్లాపూర్ సభకు తరలిరావాలని ఆదివాసీ సంఘాల సమన్వయ కర్త సిడాం భీంరావ్ కోరారు. గురువారం మండలంలోని ముత్నూర్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మెస్రం దుర్గు, మెస్రం చిన్ను, మెస్రం వెంకట్‌రావ్, ఆత్రం భీర్‌షావ్, మడావి తుకారం, కోట్నాక్ కిషన్, మడావి జాకు, పూసం బాధిరావ్, కోట్నాక్ దేవ్‌షావ్, తదితరులు పాల్గొన్నారు.

'బోథ్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి'

నేరడిగొండ/బోథ్: బోథ్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఇచ్చోడకు మంజూరైన కళాశాల రద్దు చేసి బోథ్‌లో ఏర్పాటు చేయాలని గురువారం యువకులు, లయన్స్ యూత్ సభ్యులు, రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. దీంతో భారీ వాహనాలు నిలిచిపోయాయి. గత 11 రోజులుగా శాంతియుతంగా ఉద్యమం చేస్తున్నామని, డిగ్రీ కళాశాలను ఇచ్చోడ మండలానికి కేటాయించడం బోథ్ మండల ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. బోథ్ దీక్ష శిబిరం వద్ద ఎమ్మెల్యే ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు దిష్టిబొమ్మను దహనం చేశారు. బోథ్ రెవెన్యూ డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, డీఎస్పీ కార్యాలయం, డిగ్రీ కళాశాలను బోథ్‌లో ఏర్పాటు చేయించాలని కోరారు.

వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ పర్యటన

కైలాస్‌నగర్: పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే మున్సిపల్ అధికారులను సంప్రదించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సూచించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని భగత్ సింగ్ నగర్, సుభాష్‌నగర్, వికలాంగులు, కుమ్మరికుంట కాలనీల్లో పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆయన వెంట వార్డు ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

బోథ్: ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావును బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. బోథ్ నియోజకవర్గంలో పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట గుడిహత్నూర్ బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ బ్రహ్మానంద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ సింగ్ ఉన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

సాక్షి, నెట్‌వర్క్: ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లో డప్పుచప్పుళ్ల మధ్య పీరీలను ఊరేగించారు. పలువురు మొక్కులు తీర్చుకున్నారు.

సేవలు అభినందనీయం

ఆదిలాబాద్‌రూరల్: కుల సంఘాల ప్రతినిధులకు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు దుర్గం ట్రస్ట్ ద్వారా సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమని నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ సత్కరించారు. కార్యక్రమంలో మోహన్, మొండయ్య, రాములు, రామకృష్ణ పాల్గొన్నారు.


తలమడుగు: భరంపూర్‌లో కొట్టుకుపోయిన వంతెన


గుడిహత్నూర్: దెబ్బతిన్న రోడ్డు


తాంసి: వర్షానికి కూలిన ఇల్లు


ఇంద్రవెల్లి: కోతకు గురైన రోడ్డు

వర్ష బీభత్సం..

ఆకాశానికి చిల్లు పడిందా అనే విధంగా భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జిల్లా తడిసి ముద్దయింది. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మట్టిరోడ్లు కోతకు గురయ్యాయి. వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ఇళ్లల్లోకి భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు జల దిగ్బంధంలో చిక్కుకున్నారు. వంట సామగ్రి పూర్తిగా తడిసిపోయింది. పంట పొలాలు కొట్టుకుపోయాయి. రైతులకు భారీ నష్టం వాటిల్లింది.

– సాక్షి, నెట్‌వర్క్


బోథ్: ధన్నూర్‌లో గ్రామానికి ఆనుకుని ప్రవహిస్తున్న వాగు


ఇంద్రవెల్లి: కోతకు గురైన పాటగూడ వాగు వంతెన


నార్నూర్: కోతకు గురైన ఎంపల్లి తండారోడ్డు


గుడిహత్నూర్: కోతకు గురైన రోడ్డు


కైలాస్‌నగర్: ఇంట్లోకి వచ్చిన బురద


తలమడుగు: ఉధృతంగా ప్రవహిస్తున్న తలమడుగు వాగు


సిరికొండ: కొండాపూర్‌లో భారీ వర్షానికి విరిగిపడిన విద్యుత్ స్తంభం


బోథ్: వరద పరిస్థితిని తెలుసుకుంటున్న బోథ్ సీఐ భీమేశ్


నార్నూర్: కోతకు గురైన రోడ్డు మీదుగా బైక్‌పై ప్రమాదకరంగా దాటుతున్న వ్యక్తి


నేరడిగొండ: దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అనిల్‌జాదవ్


సిరికొండ: చిక్‌మాన్ వాగు ఉధృతి


నేరడిగొండ: బోరిగాంలో దెబ్బతిన్న పంటలు


బజార్‌హత్నూర్: వంగిన విద్యుత్ స్తంభాలు


తాంసి: హస్నాపూర్‌లో ఇళ్లలోకి చేరిన వరద

'ఇంటి నుంచి బయటకు రావొద్దు'

నార్నూర్: ప్రజలు ఇంటి నుంచి బయటకు రావొద్దని తహసీల్దార్ ఆర్కా మోతిరాం, ఎంపీడీవో రమేశ్‌లు అన్నారు. గురువారం మండలంలోని ఎంపల్లితండా వద్ద కోతకు గురైనా రోడ్డు, మల్లెంగి పరిధిలోని బారిక్‌రావుగూడ వాగు, బాబేఝరి పరిధిలోని దన్నుగూడ వాగును పరిశీలించారు. మారెప్పాగూడలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరడంతో పాఠశాల భవనంలో తలదాచుకున్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట ఈజీఎస్ ఏపీవో సురేందర్ రాథోడ్, తదితరులు ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఏకదాటి వర్షాలతో ప్రాజెక్టులు, కుంటలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని అటువైపు ఎవరూ వెళ్లొద్దని ఎంపీపీ జైవంత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాంజాదవ్ సూచించారు. గురువారం మండలంలోని మత్తడి ప్రాజెక్టును సందర్శించారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున ఎవరూ బయటకు రావద్దన్నారు. వారి వెంట ఇరిగేషన్ డీఈ రాథోడ్ వినోద్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, సర్పంచ్ యశోద మోతీరాం పాల్గొన్నారు.

బేల: మండలంలోని వరూర్(కె) గ్రామంలో గురువారం ఎంపీపీ శాక్రే వనిత గంభీర్, మండల ప్రత్యేకాధికారి శంకర్‌లు పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. వరద నష్టంపై సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో మహేందర్‌కుమార్, సతీష్‌పవార్ పాల్గొన్నారు.


బేల: వరద పరిస్థితిపై ఆరా తీస్తున్న ఎంపీపీ

తాంసి: పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీంపూర్ తహసీల్దార్ మహేంద్రనాథ్ సూచించారు. గురువారం ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి మండలంలోని పెన్‌గంగ నది పరీవాహక ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లావద్దన్నారు. సర్పంచ్‌లు హనుమాన్‌దాస్, కపిల్, ఎంపీటీసీ భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రవిశంకర్, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో అబ్దుల్ సమద్‌లు అన్నారు. గురువారం మండలంలోని గుత్పాల, వడూర్, సవర్గాం, నేరడిగొండ గ్రామాల్లో పర్యటించారు. వర్షానికి దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఇళ్లను పరిశీలించారు. ఇంటి నుంచి ఎవరూ రావద్దన్నారు.

కూలిన ఇళ్లు

నేరడిగొండ: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రూపావత్ సొరాజీ, గంగిబాయి ఇండ్లు కూలిపోయాయి. ఆ సమయంలో రూపావత్ సొరాజీ, అతని భార్య ఇంట్లో ఉండడంతో స్వల్పంగా గాయపడ్డారు. వారిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

పశువులు మృతి

నేరడిగొండ: మండల కేంద్రంలో వర్షానికి రెండు పశువులు మృతి చెందాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి షేక్ వకీల్‌కు చెందిన గేదె, ఆవు వర్షం నీటికి మృతి చెందాయి. వీటి విలువ రూ.80 వేల వరకు ఉంటుందని, ఇప్పటికైనా ప్రభుత్వం నష్టం పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

పునరావాసం ఏర్పాటు

బజార్‌హత్నూర్: మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సుంగుగూడ గ్రామంలో వాగు పొంగి పొర్లడంతో వరద నీరు ఇళ్లలోకి వచ్చి చేరింది. గురువారం ఎంపీడీవో చౌహన్ రాధ, ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్, ఆర్‌ఐ మురళీధర్‌లు గ్రామానికి చేరుకుని గ్రామస్తులకు రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పునరావాసం కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అశోక్, రెడ్డినాయక్ పాల్గొన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

జైనథ్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. గురువారం అధికారులు, నాయకులతో కలిసి మండలంలోని తరోడ వద్ద సాత్నాల వాగు ఉధృతిని పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎవరూ కూడా ఆందోళన చెందవద్దన్నారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, చంద్రయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి

జైనథ్: సీఎం కేసీఆర్ కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. గురువారం మండలంలోని లక్ష్మీపూర్, సాంగ్వి(కె), ఆకుర్ల గ్రామాల్లో ఇటీవలే నిర్మించిన సవారీబంగ్లా షెడ్డులను ప్రారంభించారు. గ్రామ గ్రామాన ఆలయాలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, తుమ్మల వెంకట్ రెడ్డి, దాసరి రాములు, భగత్ గౌతమ్, కాంబ్లే భీంరావ్, ప్రభాకర్ పాల్గొన్నారు.


వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం ఏపీజే అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక జావిద్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి పృథ్వీరాజ్, నెదునూరి అశోక్, జావిద్, కైలాస్, ఇర్షాద్, అబ్దుల్లా మియా పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

కైలాస్‌నగర్: వరద ప్రవాహానికి విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పాటు విద్యుత్ తీగల తెగిపడ్డాయి. విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ జిల్లాలోని బజార్‌హత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి మండలాల్లో గురువారం పర్యటించారు. అధికారులు, సిబ్బందితో కలిసి నష్టాన్ని అంచనా వేసి, రూ.27 లక్షల నష్టం వాటిల్లినట్లుగా తెలిపారు. ఆయన వెంట డీఈ సుభాష్, ఏఈలు ఉన్నారు.


బోథ్: మునిగిన పత్తి పంట

నీట మునిగిన పంటలు

నేరడిగొండ/తాంసి/ఇంద్రవెల్లి/ బోథ్/ గుడిహత్నూర్/ సిరికొండ/బేల: భారీ వర్షం కారణంగా పంటలు నీటమునిగాయి. గురువారం వాగుల పరీవాహక ప్రాంతాల్లో పంటలు కొట్టుకుపోయాయి. పత్తి, సోయాబీన్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయా మండలాల్లో దాదాపు వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. భారీ వరదకు పొలాల్లో ఇసుక మేటలు పెట్టాయి. పంట చేలు చెరువులను తలపిస్తున్నాయి. పలు గ్రామాల్లో అధికారులు పర్యటించి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెబుతున్నారు. అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.


ఇంద్రవెల్లి: కొట్టుకుపోయిన సోయా